**18.02.2020**

**కర్నూలు**

## కర్నూలులో వైయస్సార్ కంటి వెలుగు మూడవ దశ ప్రారంభించిన సీఎం వైయస్.జగన్

## ఆస్పత్రులు నాడు–నేడు కార్యక్రమాన్ని కూడా ప్రారంభించిన సీఎం

**కర్నూలు సభలో సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి ప్రసంగంలో ముఖ్యాంశాలు:**

- ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం కోసం నాడు–నేడు చేపట్టాం
- ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చే కార్యక్రమం మొదలు పెడుతున్నాం
- కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వాటిని తీర్చిదిద్దబోతున్నాం
- పేదలు వెళ్లే ప్రభుత్వ ఆస్పత్రులన్నింటినీ జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దబోతున్నాం
- వైయస్సార్ కంటి వెలుగు ద్వారా అవ్వాతాతల కోసం మూడో దశ కంటి వెలుగు కార్యక్రమం చేపట్టాం
- ఈ విడత కంటి వెలుగులో 56.88 లక్షల మంది అవ్వాతాతలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తాం
- కళ్లజోళ్లు అవసరమైన వారికి రెండు వారాల తర్వాత గ్రామ వలంటీర్లు స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి అందజేస్తారు
- రాష్ట్రంలో ప్రతి కుటుంబం, ప్రతి సామాజిక వర్గానికి ఏ ప్రభుత్వమూ చేయని విధంగా మేలు చేస్తున్నాం
- ఇంత మంచి పరిపాలన చేస్తుంటే, ఓర్చుకోని వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది
- చంద్రబాబును చూస్తున్నారు, వారి కడుపు మంట కూడా చూస్తున్నారు

- ఆరోగ్యశ్రీలో 2వేల వ్యాధులకు పైగా చికిత్స చేస్తున్నాం ఇంకా క్యాన్సర్‌కు కూడా ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యం ఉంది కానీ, అసూయతో కూడిన కడుపు మంటకు ఎక్కడా చికిత్స లేదు
- కంటిచూపు మందగిస్తే కంటి వెలుగులో చికిత్స ఉంది కానీ, చెడు దృష్టికి మాత్రం ఎక్కడా కూడా చికిత్స లేనే లేదు
- వయసు మళ్లితే చికిత్సలు ఉన్నాయి కానీ, మెదడు కుళ్లితే మాత్రం చికిత్స లేనే లేదు
- అలాంటి లక్షణాలున్న మనుషులను మహానుభావులుగా చూపించే కొన్ని పత్రికలు, కొన్ని ఛానళ్లు ఉన్నాయి- వాటిని బాగు చేసే మందులు కూడా ఎక్కడా లేవు . వీటన్నింటి మధ్య మీ బిడ్డ మీ కోసం పని చేస్తున్నాడు
- నిజాయితీతో పని చేస్తున్నాం
- ప్రాంతీయ ఆకాంక్షలను గౌరవిస్తున్నాం
- ప్రతి కుటుంబం, అందులో పిల్లలు అభివృద్ధిలోకి వచ్చేలా చదువులు చెప్పిస్తున్నాం
- వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం మీద దృష్టి పెట్టాం
- మేనిఫెస్టోలో ప్రకటించిన వాటిలో మొదటి ఏడాది కూడా పూర్తి కాకుండానే 85 శాతానికి పైగా అమలు చేసే చర్యలు తీసుకున్నాం
- ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిగా మార్చబోతున్నాం
- ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ (ఐపీహెచ్‌ఎస్)కు అనుగుణంగా వాటిని అభివృద్ధి చేస్తున్నాం
- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏఎహెచ్‌లు, డీహెచ్‌లతో పాటు, టీచింగ్ ఆస్పత్రులను కూడా మార్చబోతున్నాం - దీని కోసం రూ.15,335 కోట్లతో పనులు చేపడుతున్నాము

- జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం
- ప్రతి పార్లమెంటు నియోజవర్గంలో టీచింగ్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తాం
- విధంగా మొత్తం 27 వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు వస్తాయి
- మొత్తం 175 నియోజకవర్గాలలో వచ్చే జూలై 31 వరకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు
- ఆపరేషన్లు అవసరమైతే మార్చి 1 నుంచి 133 కేంద్రాలు, 11 టీచింగ్ ఆస్పత్రులు, 13 జిల్లా ఆస్పత్రులు, 28 ఏరియా ఆస్పత్రులు, 81 ఎన్జీఓ కంటి ఆస్పత్రుల్లో కంటి శస్త్ర చికిత్సలు జరుగుతాయి

## సీఎం శ్రీ వైయస్.జగన్ పూర్తి ప్రసంగం

జాతీయ స్థాయి ప్రమాణాలతో, కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దుతామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) మొదలు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ), ఏరియా ఆస్పత్రులు (ఏఎహెచ్), జిల్లా ఆస్పత్రులు (జీహెచ్), టీచింగ్ ఆస్పత్రులు (టీహెచ్).. చివరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో కూడా మార్పులు చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అందుకే ఆస్పత్రులు నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆయన వెల్లడించారు. వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమం అవ్వాతాతలకు కూడా ఎంతో మేలు చేస్తుందని, అందుకే ఈ విడత కార్యక్రమంలో 60 ఏళ్లు, ఆ పైబడిన 56.88 లక్షల మందికి కంటి వైద్య పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. జూలై 31 వరకు కంటి వైద్య పరీక్షలు కొనసాగుతాయన్న సీఎం, శస్త్ర చికిత్సలు అవసరమైన

వారికి మార్చి 1 నుంచి ఆపరేషన్లు చేస్తారని, కళ్లజోళ్లు అవసరమైన వారికి రెండు వారాల తర్వాత గ్రామ వలంటీర్ల ద్వారా అవ్వాతాతల ఇళ్లకే పంపిస్తామని చెప్పారు.

రాష్ట్రంలో ప్రతి కుటుంబం, ప్రతి సామాజిక వర్గానికి మేలు చేసే విధంగా ఇంత మంచి పరిపాలన చేస్తుంటే ఓర్చుకోలేక పోతున్నారని, చంద్రబాబునాయుడు గారి మాటలు, విపక్షంలో ఉన్న వారి మాటలు వింటే అదే అనిపిస్తుందని సీఎం పేర్కొన్నారు. వాళ్లందరి కడుపు మంట కూడా అర్థం చేసుకోవచ్చన్న ఆయన, ఆరోగ్యశ్రీలో క్యాన్సర్‌కు కూడా ఉచిత వైద్యం ఉంది కానీ.. అసూయతో కూడిన కడుపు మంటకు ఎక్కడా చికిత్స లేదని, కంటిచూపు మందగిస్తే కంటి వెలుగులో చికిత్స ఉంది కానీ.. చెడు దృష్టికి మాత్రం ఎక్కడా కూడా చికిత్స లేనే లేదని, వయసు మళ్లితే చికిత్సలు ఉన్నాయి కానీ.. మెదడు కుళ్లితే చికిత్స లేదని, అలాంటి లక్షణాలున్న మనుషులను మహానుభావులుగా చూపించే కొన్ని పత్రికలు, కొన్ని ఛానళ్లు ఉన్నాయని కానీ.. వాటిని బాగు చేసే మందులు కూడా ఎక్కడా లేవని ముఖ్యమంత్రి వివరించారు.

రాష్ట్రంలో అంధత్వాన్ని 1 శాతం నుంచి 0.3 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన వైయస్సార్ కంటి వెలుగు మూడవ దశ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలులో ప్రారంభించారు. ఈ విడతలో 60 ఏళ్లు, ఆ పైబడిన 56.88 లక్షల మంది అవ్వాతాతకు కంటి వైద్య పరీక్షలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వచ్చే జూలై 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

మరోవైపు ఆస్పత్రుల్లో సమూల మార్పుల కోసం నిర్దేశించిన 'ఆస్పత్రులు నాడు–నేడు' పనులను కూడా కూడా సీఎం ప్రారంభించారు. ఆస్పత్రులు నాడు–నేడు తొలి దశలో

చేపడుతున్న పనులకు సంబంధించిన శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించారు. రూ.11,737 కోట్లతో మూడేళ్లలో దశల వారీగా ఆస్పత్రులు:నాడు–నేడు కార్యక్రమం చేపడుతున్నారు. ఇంకా ఆరోగ్యశ్రీలో సమూల మార్పులు చేస్తూ, కొత్తగా రూపొందించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులను కూడా సీఎం శ్రీ వైయస్ జగన్ ఇదే కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు.

**ఘన స్వాగతం**

తాడేపల్లి నుంచి నేరుగా ఓర్వకల్లు వచ్చిన ముఖ్యమంత్రి, అక్కడి నుంచి కర్నూలు చేరుకున్నారు. హెలిపాడ్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఎస్టీబీసీ గ్రౌండ్స్‌కు చేరుకున్న ఆయనకు దారి పొడవునా స్థానికులు ఘన స్వాగతం పలికారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా, కర్నూలులో జ్యుడీషియల్ రాజధాని ఏర్పాటుపై ప్రకటన తర్వాత తొలిసారిగా కర్నూలుకు వచ్చిన సీఎం శ్రీ వైయస్ జగన్‌కు జిల్లా వాసులు అపూర్వ రీతిలో ఆదరించారు. పిల్లలు, పెద్దలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి సీఎంకు స్వాగతం చెప్పారు.

**స్టాళ్ల సందర్శన**

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ఎస్టీబీసీ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం సందర్శించారు. డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య పరీక్షలు నిర్వహించే పరికరాలను ముఖ్యమంత్రి పరిశీలించారు.

**అందరితో ఆప్యాయ పలకరింపు**

‘అక్కా చెల్లెమ్మలు బాగున్నారా? అమ్మ ఒడి సొమ్ము అందిందా? సంక్రాంతి పండుగ బాగా జరిగిందా? అన్నదమ్ములారా బాగున్నారా? రైతు భరోసా సొమ్ము మీ ఖాతాల్లో పడిందా?

అవ్వా తాతలు బాగున్నారా? పెంచిన పింఛను సొమ్ము మీ ఇంటికే వస్తుందా?' అంటూ తన ప్రసంగం మొదలు పెట్టిన సీఎం శ్రీ వైయస్ జగన్ సభికులందరినీ ఆకట్టుకున్నారు.

**దేవుడిచ్చిన అదృష్టం**

ఇలా ఆటో అన్నదమ్ముల దగ్గర నుంచి, లాయర్ల అన్నదమ్ములు, చేనేత కారులు, మత్స్యకారులు, అగ్రిగోల్డ్ బాధితుల వరకు ఒక బిడ్డగా చేయగలిగినంత చేస్తున్నానన్న సీఎం, ఇవాళ మరో కార్యక్రమం.. అవ్వాతాతల కోసం చేపడుతున్నందుకు చాలా గర్వంగా, సంతోషంగా ఉందని చెప్పారు. వారి కోసం ఎంత చేసినా తక్కువే అన్న ఆయన, ఇది తనకు దేవుడిచ్చిన అదృష్టం అని తెలిపారు.

**జాతీయస్థాయి ప్రమాణాలతో**

కర్నూలు నుంచి రెండు పథకాలు ప్రారంభిస్తున్నామని, అందులో మొదటిది ఆస్పత్రుల్లో రూపురేఖలు మార్చడం అని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం కోసం గతంలో నాడు–నేడు చేపట్టామని గుర్తు చేసిన ముఖ్యమంత్రి, ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చే కార్యక్రమం మొదలు పెడుతున్నామని తెలిపారు.

కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో అన్ని ఆస్పత్రులను తీర్చిదిద్దబోతున్నామని, పేదలు వెళ్లే ప్రభుత్వ ఆస్పత్రులన్నీ కూడా జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దబోతున్నామని వెల్లడించారు.

ఇక రెండో కార్యక్రమం వైయస్సార్ కంటి వెలుగు అని పేర్కొన్న సీఎం, అవ్వాతాతలకు ఈ దశలో వైద్య పరీక్షలు చేస్తున్నామని చెప్పారు.

**ఐపీహెచ్‌ఎస్‌కు అనుగుణంగా**

ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిగా మార్చబోతున్నామని, 'ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్' (ఐపీహెచ్‌ఎస్)కు అనుగుణంగా, గ్రామాల్లో ఉండే ఆస్పత్రులు మొదలు, బోధన ఆస్పత్రుల వరకు అన్నింటిని మూడేళ్లలో మూడు దశల్లో పూర్తిగా మార్చబోతున్నామని సీఎం వెల్లడించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), ఏరియా ఆస్పత్రులు (ఏఎహెచ్), జిల్లా ఆస్పత్రులు (జీహెచ్), బోధనాస్పత్రుల (టీహెచ్)తో పాటు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను కూడా మార్చబోతున్నామని, ఇందుకోసం దాదాపు రూ.15,335 కోట్లతో పనులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**ఆస్పత్రులు నాడు–నేడు**

'ఆస్పత్రులు:నాడు–నేడు' తొలి దశలో కొత్తగా 7458 ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో భాగంగా 4906 కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, మిగిలిన 5252 ఉప కేంద్రాలతో పాటు, మొత్తం ఈ ఉప కేంద్రాల కోసం రూ.1,129 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు.

రెండో దశలో 1145 పీహెచ్‌సీల్లో మార్పులు చేస్తామన్న సీఎం, కొత్తగా 149 భవనాల నిర్మాణంతో పాటు, 989 పీహెచ్‌సీల మరమ్మతులు చేస్తామని, ఆ«ధునిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు, అదే విధంగా 169 సీహెచ్‌సీల రూపురేఖలు మార్చబోతున్నామని, ఇంకా 52 ఏరియా ఆస్పత్రుల ఆధునీకరణకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఏరియా ఆస్పత్రుల ఆధునీకరణ కోసం రూ.700 కోట్లు, సీహెచ్‌సీల కోసం రూ.1212 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడో దశలో జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రులను బలోపేతం చేయడంతో పాటు, కొత్తగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని, వీటన్నింటి కోసం రూ,12,300 కోట్లు ఖర్చు చేస్తామన్న సీఎం, మొత్తం వైద్య రంగం ఆధునీకరణ కోసం రూ.15,337 కోట్లు వ్యయం చేస్తున్నామని వివరించారు.

**కొత్తగా వైద్య కళాశాలలు**

రాష్ట్రంలో కేవలం 11 టీచింగ్ ఆస్పత్రులు మాత్రమే ఉన్నాయని, వాటిని పూర్తిగా మార్చడమే కాకుండా, ప్రతి పార్లమెంటు నియోజవర్గంలో ఒక టీచింగ్ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని, ఆ విధంగా మొత్తం 27 వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు వస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రతి టీచింగ్ ఆస్పత్రిలో వైద్య నిపుణులు ఉంటారని, నర్సులు కూడా అందుబాటులో ఉంటారని, అందువల్ల ఏ నిరుపేద ఆస్పత్రికి వెళ్లినా వైద్యులు ఉండని పరిస్థితి ఉండదని, మంచి వైద్యం అందుతుందని వివరించారు.

**ఏవేవి ఎన్నెన్ని?**

రాష్ట్రంలో 11 టీచింగ్ ఆస్పత్రులు.. 6 అనుబంధ ఆస్పత్రులు.. 8 సూపర్ స్పెషాలిటీ, 3 క్యాన్సర్ ఆస్పత్రులతో పాటు, 16 కొత్త మెడికల్ కళాశాలలు, మరో 16 నర్సింగ్ కళాశాలతో వైద్య రంగంలో మార్పులు తీసుకువస్తున్నామని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో కూడా పేదల వైద్యం కోసం ఇంత ఖర్చు చేయడం లేదని ఆయన చెప్పారు.

- **వైయస్సార్ కంటి వెలుగు—మూడో దశ**

‘అవ్వాతాతల కోసం ఈ విడత కంటి వెలుగు కార్యక్రమం. వృథాప్యంలో ఉన్న అవ్వాతాతలకు కంటిచూపు మందగిస్తే, ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. అందుకే వారి కోసం ఈ కార్యక్రమం చేపట్టాము. మొత్తం 175 నియోజకవర్గాలలో వచ్చే జూలై 31 వరకు కంటి వైద్య పరీక్షలు చేస్తాము. మొత్తం 56,88,420 మందికి కంటి వైద్య పరీక్షలు చేయాలని లక్ష్యం. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీతో పాటు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి మార్చి 1 నుంచి ఆపరేషన్లు చేస్తాము. రెండు వారాల తర్వాత గ్రామ వాలంటీర్లు అవ్వాతాతలకు ఇంటి వద్దనే కళ్లజోళ్లు ఇస్తారు’ అని ముఖ్యమంత్రి తెలిపారు.

133 కేంద్రాలు, 11 టీచింగ్ ఆస్పత్రులు, 13 జిల్లా ఆస్పత్రులు, 28 ఏరియా ఆస్పత్రులతో పాటు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన 81 కంటి ఆస్పత్రుల్లో ఆ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ ప్రక్రియలో గ్రామ సచివాలయాల్లోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాలు పంచుకుంటారన్న సీఎం, వైయస్సార్ కంటి వెలుగు కోసం మొత్తం 560 కోట్ల వ్యయం చేస్తున్నట్లు వెల్లడించారు.

**ఇప్పటి వరకు**

డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు తొలిదశ గత ఏడాది అక్టోబరు 10 నుంచి 16 వరకు జరిగిందని, అప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 66 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు చేశామని, అందులో 60 వేల మంది సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

ఆ తర్వాత నవంబరు 1 నుంచి డిసెంబరు 31 వరకు జరిగిందని, తొలి విడత కార్యక్రమంలో చూపులో లోపాలు గుర్తించిన విద్యార్థులలో 4,35,379 మందికి తిరిగి స్క్రీనింగ్ (రెండోసారి పరీక్షలు) చేశారని చెప్పారు. ప్రభుత్వంతో పాటు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన సుశిక్షితులైన 500 బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని తెలిపారు.

రెండో విడత కార్యక్రమంలో వైద్య పరీక్షల అనంతరం దాదాపు 1.5 లక్షల విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేయాలని, మరో 46 వేల మంది పిల్లలకు మళ్లీ (మూడో సారి) వైద్య పరీక్షలు అవసరమని గుర్తించారని చెప్పారు. అదే విధంగా శస్త్ర చికిత్స అవసరమైన విద్యార్థులకు వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు 10వ తరగతి పరీక్షల తర్వాత ఆపరేషన్లు చేస్తామని వివరించారు.

**ఓర్చుకోలేకపోతున్నారు**

'రాష్ట్రంలో ప్రతి కుటుంబం, ప్రతి సామాజిక వర్గానికి ఏ ప్రభుత్వమూ చేయని విధంగా మేలు చేస్తున్నాము. ఇంత మంచి పరిపాలన చేస్తుంటే, సహజంగానే ఓర్చుకోని వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. మీ అందరికి కూడా చంద్రబాబునాయుడు గారి మాటలు, ప్రతిపక్షంలో ఉన్న వారి మాటలు విన్నప్పుడు అదే అనిపిస్తుంది. వీళ్లందరికీ కూడా ఎంతటి కడుపు మంట ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.'

'ఆరోగ్యశ్రీలో క్యాన్సర్‌కు కూడా ఉచిత వైద్యం ఉంది కానీ, అసూయతో కూడిన కడుపు మంటకు ఎక్కడా చికిత్స లేదు. కంటిచూపు మందగిస్తే కంటి వెలుగులో చికిత్స ఉంది కానీ, చెడు దృష్టికి మాత్రం ఎక్కడా కూడా చికిత్స లేనే లేదు. వయసు మళ్లితే చికిత్సలు ఉన్నాయి

కానీ, మెదడు కుళ్లితే మాత్రం చికిత్స లేనే లేదు. అలాంటి లక్షణాలున్న మనుషులను మహానుభావులుగా చూపించే కొన్ని పత్రికలు, కొన్ని ఛానళ్లు ఉన్నాయి. వాటిని బాగు చేసే మందులు కూడా ఎక్కడా లేవు' అని సీఎం పేర్కొన్నారు.

వీటన్నింటి మధ్య మీ బిడ్డ మీ కోసం పని చేస్తున్నాడన్న ముఖ్యమంత్రి, నిజాయితీతో పని చేస్తున్నామని, ప్రాంతీయ ఆకాంక్షలను గౌరవిస్తున్నామని, ప్రతి కుటుంబం, అందులో పిల్లలు అభివృద్ధిలోకి వచ్చేలా చదువులు చెప్పిస్తున్నామని, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం మీద దృష్టి పెట్టామని, మేనిఫెస్టో ప్రకటించిన వాటిలో మొదటి ఏడాది కూడా పూర్తి కాకుండానే 85 శాతానికి పైగా అమలు చేసే చర్యలు తీసుకున్నామని వివరించారు.

చివరగా..

'మీ అందరి ఆరోగ్యం, క్షేమం, మంచి భవిష్యత్తు కోసం మీకు అండగా ఉంటాను. రాష్ట్రంలోని ప్రతి అవ్వా తాత దీవెనలు కోరుతూ, ప్రతి అక్కా చెల్లెమ్మా, ప్రతి అన్నా తమ్ముడి తోడ్పాడు కోరుతూ, మీ బిడ్డకు మీ అందరి చల్లని దీవెనలు ఉండాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను' అంటూ సీఎం తన ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీ ఆళ్ల నాని, శ్రీ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, శ్రీ అనిల్‌కుమార్ యాదవ్, శ్రీ జి.జయరామ్‌తో పాటు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

..................